ఉనికి కోసమే టీడీపీ తప్పుడు ఆరోపణలు

- అక్రమాలు నిరూపిస్తే ఆస్తులను మీకే రాసిస్తా
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వాస్తవాలు వివరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: నారా లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యిందనే ఫ్రస్ట్రేషన్‌లో టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ డ్రామాలన్నీ తమకు తెలుసునని, ప్రజల దృష్టి మరల్చేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కొండారెడ్డి బురుజు సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నా, ఆరోపణలు చేసిన వారు వచ్చి రుజువు చేస్తే శాశ్వతంగా రాజకీయాలతో పాటు, కర్నూలును వదిలి వెళ్తానని సవాల్ విసిరారు. నగరంలోని పార్కులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్న తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ముజఫర్ నగర్‌లో వక్ఫ్ బోర్డు స్థలం 10.64 ఎకరాల్లో 7 ఎకరాలను అప్పటి టీడీపీ నాయకులు వెంచర్‌వేసి అమ్ముకున్నారని, 2019 ఎన్నికల సమయంలో స్థలం అన్యాక్రాంతం కాకుండా న్యాయం చేయాలని మైనార్టీ నాయకులు కోరడంతో రెండేళ్లు పోరాటం చేసి వక్ఫ్ బోర్డు అధికారులతో మాట్లాడి కాంపౌండ్ వాల్ నిర్మించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం అక్కడ జిల్లాలోనే అతి పెద్ద మసీదు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. కాల్వబుగ్గ దేవాలయంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎస్‌ఐపై తిరగబడితే కేసు నమోదు చేశారని, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రెండెకరాల స్థలం జెడ్పీ మాజీ చైర్మన్‌ది కాదా అన్ని ప్రశ్నించారు. 2014-2019 మధ్య అసైన్‌మెంట్ కమిటీ లేదని, 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అసైన్‌మెంట్ కమిటీ అమోదం లేని వాటిని ఆన్‌లైన్ నుంచి తొలగించామని, అంతేగానీ ఎవరి స్థలాలను కబ్జా చేయలేదని స్పష్టం చేశారు. ఎస్‌ఆర్‌బీసీ కాల్వకు సంబంధించి నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చేశామన్నారు. నమ్మిన పార్టీకి మోసం చేసే గుణం తమ కుటుంబంలో లేదన్నారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, చిట్టెమ్మ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గంలో నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్లాఖాన్

కర్నూలు(సెంట్రల్) : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఎస్‌డీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్లాఖాన్ ఆరోపించారు. ఆదివారం ఎస్‌డీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో మునగాలపాడు సమీపంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఎస్‌డీపీఐ కార్యకర్తలపై ఉందన్నారు. నాయకులు జహంగీర్ అహ్మద్, అమీర్‌మావియా, అన్వర్‌హుస్సేన్, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

లోకేష్, చంద్రబాబు యాత్రలు వృథా



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): రాజకీయ మనుగడ కోసం టీడీపీ నేతలు నారా లోకేష్, చంద్రబాబునాయుడు చేసే యాత్రలు వృథా అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన ఆదివారం సీ.క్యాంప్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలను మరోసారి నమ్మించేందుకు తండ్రీ కొడుకులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించవన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు వంద రెట్లు మేలు చేశారని చెప్పారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకోవడం లేదని, గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులే మళ్లీ జగనన్నను సీఎం చేస్తాయన్నారు. ఎవరెన్ని ఎత్తులు, కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం పదవులు ఇచ్చి సమాజంలో గౌరవం, సామాజికంగా, రాజకీయంగా గుర్తింపు కల్పించారని కొనియాడారు. ప్రజల్లో జగనన్న ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, ఎలాగూ గెలవలేమని టీడీపీ నాయకులు విషం చిమ్మేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ పరిజ్ఞానం లేని లోకేష్ పాదయాత్రలో ఏ నియోజకవర్గానికి వెళితే ఆ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటివి మానుకోవాలని హితవుపలికారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు వాల్మీకులను ఎస్టీ బాబితాలో చేర్చకుండా మోసం చేసిన ద్రోహి అని ఆరోపించారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు (న్యూటౌన్): 'స్పందన ' కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్.శివ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వచ్చే వినతి పత్రాలను స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు 'స్పందన'కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



ఈ తాండ్రపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు (న్యూటౌన్): యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ సూచించారు. ఆదివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడులో నీలకంఠేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. అనంతరం క్రికెట్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ లబ్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి తడకనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నామన్నారు. పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సాముహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు కోరగా మెయింటెనెన్స్ సక్రమంగా చేసుకుంటే తప్పకుండా కట్టిస్తామన్నారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, తహసీల్దార్ రమేష్ బాబు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థిని చాందిని అభినందిస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు(న్యూటౌన్): విద్యార్థులు బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం ఉల్చాల గ్రామంలోని ఎంపీపీ నివాసంలో.. పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన సయ్యద్ చాందిని (540 మార్కులు)ని ఎంపీపీతో పాటు మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సర్పంచు విద్యాసాగర్, స్కూల్ కమిటీ చైర్మన్ అలీ షేర్ తదితరులు మిఠాయి తినిపించి ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అన్ని హంగులతో తీర్చిదిద్దారని అన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి డిజిటల్ విద్యా బోధన అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంచలింగాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు మండలం పంచలింగాల జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం మనోరంజని తెలిపారు. పాఠశాలలో 14 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసి అందరూ పాసైనట్లు చెప్పారు. విద్యార్థి సందెపోగు అక్షయ 504 మార్కులతో సత్తా చాటారని వెల్లడించారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి మదన్‌మోహన్ గౌడు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపట్టే విధంగా రైతులను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ కోడుమూరు డివిజన్ అధికారి మదన్‌మోహన్‌గౌడు సూచించారు. ఆయన ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. టమాట, బెండ, మిరప, ఉల్లి తదితర పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. మిరప పంటలో నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూరగాయల పంటల్లో తెగుళ్లు, పురుగుల యాజమాన్యం గురించి సూచనలు ఇచ్చారు. కూరగాయలు, పండ్లతోటల్లో సాధ్యమైనంత వరకు కెమికల్స్ వాడకాన్ని తగ్గించాలని, పశువుల ఎరువులు, కంపోస్టు ఎరువులు వినియోగించాలని కోరారు. ఉద్యాన పంటల్లో అధికోత్పత్తి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ చీడపీడలను తట్టుకునే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, విత్తనశుద్ధి అత్యవసరమని, మొక్కల మధ్య తగిన దూరం పాటించాలని సూచించారు. తరచూ ఒకే పంట వేయరాదని, పంట మార్పిడి చేయాలన్నారు. రైతులకు సరైన సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.





అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, నివాళులర్పిస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమాలు

కర్నూలు(సెంట్రల్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్ స్పష్టం చేశారు. ఆదివారం అల్లూరి 99వ వర్ధంతి పురస్కరించుకొని అశోక్‌నగర్ జంక్షన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లూరి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ముజఫర్ నగర్ టి.నరసింహయ్య గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. అలాగే ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అదేవిధంగా పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ, ఇఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో గోకారి భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.భాస్కర్, నాయకులు నాయకులు రమేష్, రంగనాయకులు, సురేష్‌నాయక్, శిరీషా, డీవైఎఫ్ఐ నాయకులు నాయకులు శిరీష, శంకర్, రంగప్ప, హుస్సేన్‌బాషా, అమర్, యోగి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



కర్నూలు నగరంలోని మండిబజార్‌లో మ్యాన్‌హోల్‌కు మూతలేక రోజులు గడుస్తున్నాయి. మరోవైపు ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు వెళ్తుంటారు. ఆదమరిస్తే మ్యాన్‌హోల్‌లో పడే అవకాశం ఉంది. దీని కారణంగా రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య కూడా ఉత్పన్నం అవుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – కర్నూలు (హాస్పిటల్)

నవ్వితే హృదయం పదిలం



మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్‌ను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మనసారా నవ్వితే హృదయం ఆరోగ్యంగా ఉంటుందని కార్డియాలజిస్టు, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను డాక్టర్ పి.చంద్రశేఖర్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 60 వేల లాఫింగ్ క్లబ్‌లు ఉన్నాయని, దీన్ని బట్టి నవ్వుకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందన్నారు. మనసారా నవ్వితే మెదడులో ఎండార్ఫిన్‌లు విడుదలై హృదయానికి మేలు చేస్తాయని, వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, మానసిక ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన తగ్గుతాయని, పలు రకాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. చిరునవ్వుతో మానవ సంబంధాలు, కమ్యూనికేషన్స్ పెరుగుతాయని, మనిషి జీవితకాలం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి దైనందిత జీవితంలో నవ్వును ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ జె.రమేష్ చేసిన మిమిక్రీ విశేషంగా అలరించింది. అనంతరం ఆయన్ను డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు కల్కూర చంద్రశేఖర్, చంద్రశేఖర్, ఎలమర్తి రమణయ్య, పాపారావు, వాసు, లక్ష్మణ్ సన్మానించారు.

వ్యక్తిపై దాడి

నందవరం : మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న(45) అనే వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆదివారం ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న తన పొలంలో పని చేసిన కూలీలకు కూలి డబ్బులు పంపిణీ చేయాలని శనివారం ఇంట్లో నుంచి రూ.30 వేలు తీసుకుని బైక్‌పై మాచాపురంకి వెళ్లాడు. రాత్రి 7:30 గంటలకు ఈరన్న భార్య బోయ రాములమ్మకు ఇబ్రహీంపురం గ్రామ ఊరి బయట అప్పవారి కట్ట పొలం వద్ద రక్తగాయాలతో పడిఉన్నాడని సమాచారం అందింది. దీంతో ఆమె బంధులవుతో కలిసి వెళ్లి చూసింది. ఎలా జరిగిందని ఈరన్నను అడుగగా సైగలతో ఐదుగురు వ్యక్తులు దాడి చేశారని తెలిపాడు. అతన్ని చికిత్స నిమిత్తం వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యం అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈరన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దమరివీడులో దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల: ప్రభుత్వం రైతులకు అందజేసే సూక్ష్మనీటి సాగు పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్, ఓఎస్‌డీ వైవీఎస్ ప్రసాద్, పంచాకులు ఉమాదేవి కోరారు. మండలంలోని పెద్దమరివీడు, కులుమాల గ్రామాల్లో బొప్పాయి, మిరప పంటలను ఆదివారం పరిశీలించారు. కల్లాల్లో ఆరబెట్టిన పండు మిరపను పరిశీలించి రైతుల పంట దిగుబడి, ఆరబెట్టుకునే విధానం, పంటకోతలు, అమ్మకం జరిపే విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అకాల వర్షాల వల్ల పంట ఉత్పత్తులను కాపాడుకునే పద్ధతులను రైతులకు వివరించారు. అలాగే పురుగులు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం వేముగోడు గ్రామంలో మిరప పంటలలో సూక్ష్మనీటి సాగు పథకం ద్వారా రాయితీపై అమర్చిన డ్రిప్ పరికరముల వినియోగాన్ని పరిశీలించి, డ్రిప్ వినియోగంపై రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజినేయులు, ఎమ్మిగనూరు ఉద్యాన శాఖ శ్రీవాణి, ఎంపీడీసీ జయరామిరెడ్డి, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులు సూక్ష్మ నీటి సాగు పథకాలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ నీటి సాగు పథకం ఓఎస్‌డీ వై.వి.ఎస్. ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలదొడ్డి, కందనాతి, మాసుమాన్‌దొడ్డి, గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి, కులమాల, పెద్దమరివీడు గ్రామాల్లో వర్షాల కారణంగా దెబ్బ తిన్న మిరప, పండ్ల తోటలు, డ్రిప్ ఇరిగేషన్ అయన పరిశీలించారు. వర్షాల కారణంగా మిరప, పండ్ల తోటలకు ఎంత నష్టం వాటిల్లిందో తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని చెప్పారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, భండార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. మొక్కుబడులున్న భక్తులు మోకాళ్లపై మెట్లను ఎక్కుతూ ప్రతి మెట్టుకు టెంకాయ కొట్టి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

క్లుప్తంగా

పారదర్శకంగా విద్యుత్ బిల్లుల జారీ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఆపరేషన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న సూచించారు. ఆదివారం ఆయన కిందిస్థాయి ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు. ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్, ఇతర సురక్షిత యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

బుడగ జంగాలకు న్యాయం చేయండి

కర్నూలు(అర్బన్): సంచార కులమైన బేడ బుడగ జంగాల సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆ సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలుకు వచ్చిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. టీడీపీ మేనిఫెస్టోలో బేడ బుడగ జంగాలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించే అంశం చేర్చాలని, కేంద్ర ప్రభుత్వం ద్వారా తమ కులానికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని హామీ ఇవ్వాలన్నారు. లోకేష్‌ను కలిసిన వారిలో సంఘం నేతలు డీకే రంగస్వామి, సిరివాటి గిరి, ధూపం సురేష్, అంజి, నరేష్, చింతలయ్య, మాధవరావు ఉన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు ఆదిత్య నగర్ గ్రంథాలయ శాఖ అధికారి ఇ.సంధ్యారాణి తెలిపారు. ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ఉంటుందని పేర్కొన్నారు. శిబిరంలో ఉదయం 8 నుంచి కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లీష్, పెయింటింగ్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ బొమ్మలు తయారు చేయడం అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమయానికి ఉద్యోగులకు జీతాలు పడకపోవడంతో కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో మాదిరిగా 104 సంస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. 104 ఉద్యోగులకు ఆప్కాస్‌లో జీతాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రహాస్, జగదీష్ పాల్గొన్నారు.

దళిత బాంధవుడు సంజీవయ్య

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దళిత బాంధవుడు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు కొనియాడారు. ఆదివారం దామోదరం సంజీవయ్య వర్ధంతి పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు సేవ చేశారన్నారు. ఆయన ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందన్నారు. సంజీవయ్య జిల్లా వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. నాయకులు జాన్‌విల్సన్, బతుకన్న, కోసిగి జికానీ, అమరేందర్‌రెడ్డి, సత్యరాజు, ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

16న ఏపీ రైతు సంఘం సమావేశం

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 16వ తేదీన కర్నూలులోని సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు చెప్పారు. ఇటీవల అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నా ప్రభుత్వం ఆదుకోకపోవడంపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీకాంప్లెక్స్: రామబాణం,ఉగ్రం,విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2,గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, పొన్నియిన్ సెల్వన్–2, ఉగ్రం, విరుపాక్ష, ఏజెంట్, రామబాణం
వెంకటేష్ సినీకాంప్లెక్స్: ఉగ్రం, విరుపాక్ష, రామబాణం
ఐనాక్స్: గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3, ఉగ్రం, దికేరళస్టోరీ,ఇవిల్‌డెడ్‌రైజ్,పొన్నియిన్ సెల్వన్–2
భరత్ కాంప్లెక్స్ : ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు
శ్రీరామ : రామబాణం
రాజ్: పొన్నియిన్ సెల్వన్–2
విజయ : రామబాణం